03102024-DIS-08_Layout 1 10/3/2024 3:57 AM Page 1



# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు

**పశ్చిమాసియా** మరోసారి ప్రత్యక్ష యుద్ధపు సుడిగుండంలోకి జారుకుంటున్నది. ఓ పక్క ఇజ్రాయెల్, మరోపక్క ఇరాన్ కలబడుతుండటం ప్రపంచాన్ని కలవరపరుస్తున్నది. హిజ్బొల్లా అగ్రనేత నస్రల్లాను వైమానిక దాడిలో ఇజ్రాయెల్ తుదముట్టించినప్పటి నుంచి ఉద్రిక్తతలు కుత కుత ఉడుకుతున్నాయి. తర్వాత ఇజ్రాయెల్ దక్షిణ లెబనాన్‌లో భూతల యుద్ధం ప్రారంభించింది. హిజ్బొల్లా స్థావరాలు, నేతలు లక్ష్యంగా దాడులు జరుపుతున్నది. ఇటీవల పలువురు ఇరాన్ సీనియర్ సైనికాధికారులనూ డ్రోన్ దాడుల్లో ఇజ్రాయెల్ చంపేసింది. ఈ పరిణామాలను జీర్ణించుకోలేకపోతున్న ఇరాన్ మంగళవారం రాత్రి సుమారు 200 క్షిపణులతో ఇజ్రాయెల్‌పై విరుచుకుపడింది. ఇరాన్ ఇలా ప్రత్యక్ష దాడికి దిగడం పశ్చిమాసియాలో ఇప్పటికే దావానలంలా వ్యాపిస్తున్న విద్వేషాగ్నికి ఆజ్యం పోసినట్టయింది. దీనిని సాకుగా తీసుకొని ఇరాన్‌పై ఇజ్రాయెల్ విరుచుకుపడబోతున్నది. లెబనాన్, యెమెన్‌లో ఇరాన్ అనుకూల గెరిల్లా దళాలు ఈ సరికే ఇజ్రాయెల్‌తో క్షిపణుల యుద్ధం నెరపుతున్నాయి. ఇవన్నీ వెరసి ఎటు దారి తీస్తాయోననే ఆందోళన అంతకంతకూ పెరుగుతున్నది.

ప్రస్తుత పశ్చిమాసియా సంక్షోభం వెనుక ఏడు దశాబ్దాలకు పైగా సాగిన పరిణామాల నీడలున్నాయి. పశ్చిమదేశాల ఆధిపత్యవాదం, స్థానికంగా ఉండే మతవాదం, చమురు కలగలిసి మందుగుండుగా తయారైన పరిస్థితి. ఒకప్పుడు పాలస్తీనా సమస్య చుట్టూ పశ్చిమాసియా పరిభ్రమించినా కాలక్రమంలో అరబ్బు దేశాలు దౌత్యపరమైన పరిష్కారం వైపు మొగ్గడం మొదలుపెట్టాయి. యుద్ధోన్మాదం పట్ల ప్రజల్లో పెరిగిన వ్యతిరేకత, ప్రగతి సంక్షేమాల పట్ల పెరిగిన సానుకూలత అందుకు కారణం. ఈ నేపథ్యంలో ఇరాన్ ఒక్కటే పాలస్తీనా మద్దతుదారుగా మిగిలిపోయింది. సిరియా, లెబనాన్, యెమెన్‌లలోని తన మద్దతుదారుల ద్వారా ఇజ్రాయెల్‌పై పరోక్ష యుద్ధం కొనసాగిస్తున్నది. ఇప్పుడది ముదిరిపోయి ప్రత్యక్ష యుద్ధంగా పరిణమిస్తున్నది.

గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న నరమేధంలో పదుల వేల సంఖ్యలో జనం చచ్చిపోతున్నారు. లక్షల సంఖ్యలో కాందిశీకులు గూడు చెదిరి అగచాట్లు పడుతున్నారు. మరో వైపు దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెలీ దళాలు భూతల యుద్ధం మొదలుపెట్టాయి. అవి చాలవన్నట్టుగా ఇప్పుడు పులి మీద పుట్రలా యుద్ధం వచ్చి పడుతున్నది. ఇది రెండు దేశాలకు పరిమితమైన యుద్ధంగా ఉండబోదని కచ్చితంగా చెప్పవచ్చు. అదేవిధంగా దీని ప్రభావం ప్రపంచంలోని దేశాలన్నిటిపైనా ఎంతో కొంత ఉండి తీరుతుంది. నిన్నటిదాకా నేల చూపులు చూసిన అంతర్జాతీయ చమురు ధర ఒక్కసారిగా పైపైకి ఎగబాకుతుండటమే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా నౌకా రవాణా ఇప్పటికే భయం నీడలో సాగుతున్న సంగతి తెలిసిందే.


పశ్చిమాసియా సంక్షోభమంతటికీ పాలస్తీనా సమస్య కేంద్రబిందువు లాంటిది. ఆ సమస్యకు రెండు దేశాల సూత్రమే ఏకైక పరిష్కార మార్గం. కానీ, యుద్ధంతో శాంతిని కొనుక్కోవాలని ఇజ్రాయెల్ చూస్తున్నది. పాలస్తీనా అస్తిత్వాన్ని అంగీకరించి వారి భూభాగాన్ని వారికి సంపూర్ణ సార్వభౌమాధికారంతో అప్పగించడమే అసలు సిసలు శాంతికి బాటలు వేస్తుందని ఇజ్రాయెల్ గుర్తించాలి. పాలస్తీనా సమస్య పర్యవసానంగానే ప్రస్తుత యుద్ధం రాజుకుంటున్నది. ఇది ఏ మాత్రం ఉపేక్షించదగిన విషయం కాదు. ఇజ్రాయెల్ అప్రకటిత అణ్వస్త్ర దేశమైతే ఇరాన్ అనుమానిత అణ్వస్త్ర దేశం అనేది ఈ సందర్భంగా గుర్తుంచుకోవాలి. ఈ రెండు దేశాలు కత్తులు దూసుకోవడం ప్రపంచానికి ఏమంత శ్రేయస్కరం కాదు. తక్షణమే ఐక్యరాజ్య సమితి విపత్కర పర్యవసానాలతో కూడిన ప్రస్తుత యుద్ధాన్ని ఆపేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేయాలి. ఇజ్రాయెల్, అమెరికా చిత్తశుద్ధితో సహకరిస్తేనే శాశ్వత శాంతి సాధ్యమవుతుంది.

# ప్రకృతి విధ్వంసం-తక్షణ మేలుకొలుపే మార్గం

**ప్రపంచ మానవాళి ఇప్పుడు ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య ప్రకృతి విధ్వంసం. పర్యావరణ మార్పుల ద్వారా ఎదురవుతున్న సమస్యలు, అకాల వర్షాలు, వరదలు, విపరీతమైన ఎండలు, మారుతున్న రుతువులు ఇదీ ప్రస్తుతం ప్రపంచ పరిస్థితి. ఎడారుల్లో వరదలు వస్తున్నాయి, హిమాలయాల్లో మంచు మాయమవుతున్నది. ఓ వైపు నగరాలు మునిగిపోతున్నాయి. మరోవైపు గ్రామాలు నీటి కోసం అల్లాడుతున్నాయి. రుతువులు గతి తప్పుతున్నాయి. కరోనా వంటి కొత్త జబ్బులు భయపెడుతున్నాయి. వీటన్నింటికీ మూలం అంతరిస్తున్న అడవులు, కనుమరుగవుతున్న పచ్చదనం.**



**జోగినపల్లి సంతోష్‌కుమార్**



జనాభా విపరీతంగా పెరగటమే కాదు, పెరుగుతున్న ప్రజల అవసరాల కోసం జరుగుతున్న అభివృద్ధి ప్రకృతికి గొడ్డలిపెట్టు అవుతున్నది. సహజ వనరులను విచక్షణారహితంగా వాడుతున్నా రు. మరి ఈ విధ్వంసానికి అంతం లేదా, పౌరులుగా మన బాధ్యత ఎంతన్నది ఒక్కసారి ప్రతీ ఒక్కరూ ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉన్నది. మన వంతుగా ప్రకృతి సమతుల్యతను కాపాడేందుకు, పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ఎలా నడుం బిగించామన్నది ముఖ్యం. ప్రతీ ఒక్కరు తమ వంతు బాధ్యతగా పర్యావరణ హితానికి పాటుపడాలి.

**నడిచే ప్రకృతి పాఠశాల: పద్మశ్రీ జాదవ్ పయంగ్**

సమాజ హితాన్ని కోరుతూ చేసే నిస్వార్థ ప్రయత్నం ఆలస్యంగానైనా గమ్యాన్ని ముద్దాడుతుంది. పద్మశ్రీ, ఫారెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన జాదవ్ మొలాయ్ పయంగ్ ప్రయాణమే ఇందుకు తిరుగులేని ఉదాహరణ. పర్యావరణ మార్పులు తద్వారా ఎదురయ్యే సమస్యలపై ఎవరూ మాట్లాడని సమయంలోనే ఆయన ఆచరణ మొదలుపెట్టారు. దేశానికి ఈశాన్య ప్రాంతం మజులీలో ఆయన చేసిన ప్రకృతి యజ్ఞం ఓ అడవినే సృష్టించింది. ఫలితం గురించి ఆశించకుండా ప్రయత్నాన్ని మాత్రమే కొనసాగించారు. ఈ అవిరళ శ్రమలో ఆయన ఎక్కడా ఫలితంపై ఆశ వీడలేదు, గుర్తింపును ఆశించలేదు. పనిచేస్తూ వెళ్తే వాటంతటవే అవార్డులు వచ్చాయి.

**అమాయకపు మొఖం, బోసి నవ్వుతో కనిపించే అరువై నాలుగేండ్ల పయంగ్ ఆశయాల ప్రయాణం బ్రహ్మపుత్ర నది అంతటి విశాలమైనది. ఇటీవల నా అసోం పర్యటనలో ఆయనతో కొంత సమయం గడపటం, అత్యంత స్ఫూర్తిదాయకమైన ఆయన అనుభవాలు పంచుకోవటం అదృష్టంగా భావిస్తున్నా. స్వయంగా 'గ్రీన్ ఇండియా ఛాలెంజ్'లో పాల్గొని మమ్మల్ని జాదవ్ పయంగ్ ఆశీర్వదించటం మా భవిష్యత్ కార్యక్రమాలకు ఆక్సిజన్‌లా భావిస్తున్నాం.**

నలభై ఐదేండ్ల కింద ఆయన యుక్త వయస్సులో ఉన్నప్పుడు అసోం మజులీ తీరంలో కొన్ని పాములు, ఇతర నీటి జంతువులు చనిపోయి ఉండటాన్ని గుర్తించిన పయంగ్ అప్పుడే ప్రమాదాన్ని పసిగట్టారు. తీరం కోతకు గురికావటం, జంతువులు, సరీ సృపాలకు నిలువ నీడలేదని గుర్తించి కొన్ని వెదురు మొక్కలు నాటి సంరక్షించారు. అలా పెరిగిన వెదురువనం క్రమంగా చిన్న జంతువులకు ఆవాసంగా మారింది. ఇది గుర్తించిన జాదవ్ క్రమంగా బ్రహ్మపుత్ర నదీతీరం వెంట మొక్కలు నాటుతూ వెళ్లారు. అలా ముప్పై ఏండ్ల పాటు ఏకంగా 1,360 ఎకరాల్లో అడవిని పెంచారు. అనతికాలంలోనే సమీప మైదాన ప్రాంతాలన్నీ పచ్చదనం పరుచుకోవటం మొదలైంది. కొన్నేండ్ల తర్వాత అటుగా వచ్చిన అటవీ అధికారులే ఆశ్చర్యపోయారు. జాదవ్ కృషిని గుర్తిస్తూ ఆయన పేరు పైనే మొలాయ్ అడవిగా (మొలాయ్ రిజర్వ్ ఫారెస్ట్ బ్లాక్) అధికారికంగా నామకరణం చేశారు. జాదవ్ పెంచిన చిట్టడవి క్రమంగా చిక్కటి అడవిలా విస్తరిం చింది. ఉడతలు, జింకలు, రైనోలు, ఏనుగులు, బెంగాల్ టైగర్లతో పాటు వందలాది రకాల పక్షులు, జంతుజాలానికి ఆవాసంగా మారింది. ఏటా సీజన్‌లో వందకు పైగా ఏనుగుల గుంపు మొలాయ్ అటవీ ప్రాం తంలో కొన్ని నెలల పాటు సేద తీరుతాయి. అసోం అడవుల్లో వేటగాళ్ల బుల్లెట్లకు బలవుతున్న రైనోలు ఇక్కడ మాత్రం స్వేచ్ఛగా విహరిస్తాయి.

దివంగత అబ్దుల్ కలాం చెప్పినట్టు ఉడతను పెంచుకుంటే వెళ్లిపోతుంది, పక్షిని పెంచుకుంటే ఎగిరిపోతుంది. కా నీ, చెట్టును పెంచితే ఆ రెండూ మన ఆవరణలోనే వచ్చి చేరుతాయనే నానుడి మొలాయ్ అడవితో నిజమైంది.

ఒంటరి ప్రకృతి సైనికుడిలా జాదవ్ పయంగ్ చేసిన కృషిని కేంద్ర ప్రభుత్వం గుర్తించి 2015లో దేశంలోనే అత్యున్నత 4వ పౌర పురస్కారం పద్మశ్రీతో సత్కరించింది. మాతో గడిపిన సమయంలో ఆయన జీవన పయనాన్ని నెమరు వేసుకున్నారు. బ్రహ్మపుత్ర నది, అసోం, మజులీ, అడవితో తన అనుబంధాన్ని పంచుకున్నారు. పర్యావరణ మార్పులు, మానవాళికి పొంచి ఉన్న ముప్పుపై ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్ తరాలకు నివాసయోగ్యమైన పరిసరాలను అందించటం ప్రతీ ఒక్కరూ తమ బాధ్యతగా గుర్తించాలని అన్నారు. పర్యావరణ విద్యను తప్పనిసరి చేయటమే కాదు, ప్రకృతి పాఠాలు తరగతి గది నుంచి బాహ్య ప్రపంచానికి మారాలని ఆకాంక్షించారు. కేవలం పుస్తకాల్లో ఉన్నది బోధించకుండా, క్షేత్రస్థాయిలో జరుగుతున్న ప్రకృతి విధ్వంసాన్ని నేటి పౌరులకు అర్థమయ్యేలా చేయాలని జాదవ్ పయంగ్ చెప్తున్నారు.

ప్రకృతి పునరుజ్జీవనం అనేది ఎవరో చేసేది కాదని, ప్రతీ పౌరుడూ విధిగా అనుసరించాల్సిన బాధ్యత అని అన్నారు. పెరుగుతున్న జనాభాను, వారి అవసరాలను తీర్చే అభివృద్ధిని ప్రస్తుత పరిస్థితుల్లో కాదనలేమని, కానీ, అడవులు, సహజ వనరులపై పడుతున్న భారాన్ని మాత్రం తగ్గించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వనరులను కాపాడుతూనే అభివృద్ధి చేసే ప్రత్యామ్నాయ మార్గాలపై పరిశోధనలు జరగాలని తెలిపారు. ఈశాన్య హిమాలయాలకు పొంచి ఉన్న ముప్పుపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వరదలు, రుతువుల్లో మార్పులు, అనూహ్య వ్యాధులకు ప్రకృతి ప్రకోపమే కారణమని జాదవ్ అంటున్నారు. మన రాష్ట్రంలో వనజీవి రామయ్య వంటివారున్నారు. జాదవ్‌ను చూస్తే మన రామయ్య గుర్తుకువచ్చారు. ప్రకృతి కోసం పరితపించే ఇలాంటి మనుషులు ఇంకా పెరగాలి. ఇది కేవలం ఏ ఒక్కరి బాధ్యతనో కాదు. మనందరి సమష్టి బాధ్యత.

**అడవుల విధ్వంసం- పర్యావరణహిత చర్యలు:**

**గ్లోబల్ ఫారెస్ట్ వాచ్ నివేదిక ప్రకారం భారతదేశం 2000-23 మధ్య 2.33 మిలియన్ హెక్టార్ల (57,57,555 ఎకరాల) అటవీ భూమిని కోల్పోయింది. విచక్షణారహితంగా కొనసాగుతున్న అడవుల నరికివేతకు తోడు, అభివృద్ధి కార్యక్రమాల పేరుతో మళ్లించిన అటవీ భూమి కూడా ఇందులో ఉన్నది. అయితే, ప్రకృతి సంపదకు నిలయమైన ఐదు ఈశాన్య రాష్ట్రాలు అసోం, మిజోరం, అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్‌లో ఈ అటవీ విధ్వంసం ఎక్కువగా ఉండటం మాత్రం ఆందోళన కలిగించే విషయం.**

మిగతా ప్రాంతాలతో పోలిస్తే అసోం 2050 నాటికల్లా 330 శాతం ఎక్కువ పర్యావరణపరమైన ప్రమాదాలను ఎదుర్కోబోతున్నది. రాష్ట్రంలో 60 శాతం జిల్లాలపై ఈ ప్రభావం పడుతుంది. అలాగే దేశవ్యాప్తంగా అడవుల నరికివేత ద్వారా జరుగుతున్న ప్రకృతి విధ్వంసం ఏటా 51 మిలియన్ టన్నుల కార్బన్‌డై ఆక్సైడ్ విడుదలకు సమానం. అంటే నిత్యం వివిధ కారణాలతో వెలువడే కర్బన ఉద్గారాలకు ఇది అదనం అన్నమాట. ఈ పర్యావరణ దుష్పరిణామాల వల్ల ఎదురౌతున్న భౌగోళిక పరిస్థితులను ఇప్పుడు మనమంతా ఎదుర్కొంటున్నాం. వేగంగా మారుతున్న వాతావరణం, విపరీతమైన వేడి, అకాల వర్షాలు, వరదలు, సీజన్ల మార్పు ఈ కోవలోకే వస్తాయి. క్లైమెట్ సెంట్రల్ నివేదికను ఒక్కసారి గమనిస్తే... ఈ సీజన్‌లో 21 రోజులు అత్యధిక వేడి రోజులు నమోదయ్యాయి. గడిచిన 55 ఏండ్లలో ఎన్నడూ ఈ స్థాయిలో వేడి రోజులు నమోదు కాలేదు. అలాగే ఏపీలో ఇదే సీజన్‌లో 14 రోజులు వేడి రోజులుగా నమోదయ్యా యి. అంటే, సగటును మించిన వేడిని మనం ఈ సీజన్‌లో ఎదుర్కొన్నాం. ఇది అత్యంత ప్రమాదకరమైన సంకేతం. మనం ఇప్పటికైనా మేల్కోవాలి.

**అందుకే మన పరిసరాల్లో ప్రకృతిని కాపాడటం ఒక ఎత్తు అయితే, కోల్పోయిన పచ్చదనాన్ని తిరిగి వీలున్నంతగా సాధించటం మరో ఎత్తు. అదే సమయంలో ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణ, హిమాలయాలతో పాటు నదుల కాలుష్యం తగ్గింపు, నీటి వనరులను కాపాడుకోవటం, చిత్తడి నేలల అభివృద్ధి, పెట్రోల్, డీజిల్ వాడకం నియంత్రిస్తూ ఈవీ వాహనాలను ప్రోత్సహించటం ఇవన్నీ కూడా ప్రకృతి పునరుజ్జీవనానికి తోడ్పాటునందించే చర్యలే. అడవులపై ఆధారపడి జీవించేవారికి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు, అటవీ సేకరణ ఉత్పత్తులకు తగినంత ఆదాయం ఉండేలా చేయటం నరికివేతను తగ్గించే మార్గాలు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తోడు ప్రతీ పౌరుడూ విధిగా బాధ్యతాయుతంగా వ్యవహరించినప్పుడే ఇది సాధ్యమవుతుంది.**



పద్మశ్రీ జాదవ్ పయంగ్‌తో సంతోష్ కుమార్

**గ్రీన్ లీడర్‌గా యువరాష్ట్రం-తెలంగాణకు హరితహారం:** 2014లో ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటైన తెలంగాణ కే.చంద్రశేఖరరావు సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమాలకు సమ ప్రాధాన్యాన్నిస్తూ నివాసయోగ్యమైన పరిసరాల కల్పనపై దృష్టిపెట్టింది. అందుకే, 2015లోనే తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. రానున్న తరాలకు మెరుగైన వాతావరణం అందించటం మన బాధ్యత అంటూ కేసీఆర్ చేపట్టిన హరితహారం పదేండ్లలో అద్భుత ఫలితాలను సాధించింది. సుమారు 280 కోట్ల మొక్కలు రాష్ట్రవ్యాప్తంగా నాటడంతో పచ్చదనం 24 నుంచి 31 శాతానికి పెరిగింది. (ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం) రాష్ట్ర రహదారులు పూల బాటలయ్యాయి.

**అడవుల పునరుజ్జీవనంతో కొత్త కళను సంతరించుకున్నాయి. పెద్ద సంఖ్యలో అభివృద్ధి చేసిన అర్బన్ ఫారెస్ట్ పార్కులు పౌరులకు సహజ ఆక్సిజన్ వనరులుగా (లంగ్ స్పేస్‌లుగా) రూపాంతరం చెందాయి. కేసీఆర్ దూరదృష్టి, హరిత హారం కార్యక్రమమే 'గ్రీన్ ఇండియా ఛాలెంజ్' మొదలు పెట్టేందుకు స్ఫూర్తిగా నిలిచింది. తెలంగాణ ఫలితాలను దేశవ్యాప్తంగా అమలయ్యేలా చూడాలనే సంకల్పమే 'గ్రీన్ ఇండియా ఛాలెంజ్'కు శ్వాసగా నిలిచింది.**

**హరిత భారత్- గ్రీన్ ఇండియా ఛాలెంజ్ పాత్ర:** హరిత భారత స్వప్నాన్ని ఆకాంక్షిస్తున్న 'గ్రీన్ ఇండియా ఛాలెంజ్' కార్యక్రమం దశలవారీగా విస్తరిస్తున్నది. ప్రకృతిని కాపాడాలి, పచ్చదనం పెంచాలనే హరిత భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేయటమే మా కార్యక్రమాల లక్ష్యం. ఒక్కొక్కరు మూడు మొక్కలు నాటాలి, మరో ముగ్గురికి హరిత సవాల్ విసరటాన్ని బలంగా సమాజంలోకి తీసుకువెళ్లగలిగాం. 2018లో ప్రారంభమైన గ్రీన్ ఛాలెంజ్ ఇప్పటివరకు తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాలకు విస్తరించింది. ఏడు విడతల్లో సుమారు 19.50 కోట్ల మొక్కలు 'గ్రీన్ ఇండియా ఛాలెంజ్' ద్వారా నాటాము. పలు రంగాలకు చెందిన ప్రముఖులను, సెలబ్రిటీలను భాగస్వామ్యం చేయటం ద్వారా వారి ని అనుసరించే అభిమానులు అందరూ 'గ్రీన్ ఇండియా ఛాలెంజ్'లో భాగమయ్యేలా చేయగలిగాం.

అడవుల దత్తత కార్యక్రమాన్ని మొదలుపెట్టి తెలంగాణలోని కీసర, ఖాజీపల్లి, బొంతపల్లి, చెంగిచెర్ల, హరిణ వనస్థలి రక్షిత అటవీ ప్రాంతాల్లో క్షీణించిన అటవీ పునరుద్ధరణలో గ్రీన్ ఇండియా భాగస్వామ్యమైంది. హైదరాబాద్‌తో పాటు ముంబై, ఢిల్లీ, భువనేశ్వర్‌లలో పలు కార్యక్రమాలు చేపట్టాం. వీటన్నింటిలో భాగస్వామ్యులైన లక్షల మందికి వినమ్రపూర్వక కృతజ్ఞతలు. కానీ, ఈ హరిత యజ్ఞం మరింతగా కొనసాగాలి, హరిత భారత్ స్వప్నం సాకారం కావాలనేది మా బలీయమైన ఆకాంక్ష. ఈ ఏడాది అసోంలో 'గ్రీన్ ఇండియా ఛాలెంజ్' మొదలుపెట్టాం. అందమైన అసోంలో పచ్చదనం క్షీణించటం, ప్రకృతి విలయాలు పెరగటం బాధాకరం. అందుకే పద్మశ్రీ జాదవ్ పయంగ్ స్ఫూర్తితో ఆయనతో కలిసి పనిచేస్తు న్నాం.

**జాదవ్ మార్గనిర్దేశంలో 2030 కల్లా అసోంలో కోటి మొక్కలు నాటి సంరక్షించాలనే బృహత్ కార్యాన్ని మొదలుపెట్టాం. దీనిలో స్థానిక సంస్థలు, ఎన్జీవోలు, పౌరులను భాగస్వామ్యం చేస్తున్నాం.ఇందులో అన్నివర్గాలనూ భాగస్వామ్యం చేస్తాం, కలిసివచ్చే చేతులతో మొక్కలు నాటిస్తాం. పార్టీలు, వర్గాలు, ప్రయోజనాలకతీతంగా 'హరిత భారత్' లక్ష్యంగా పనిచేయాలనేదే మా సంకల్పం. ఇటీవల అసోంలో జరిగిన కార్యక్రమంలో తముల్‌పూర్ ఎమ్మెల్యే జోలెన్ దోయినరీ స్వయంగా 'గ్రీన్ ఇండియా ఛాలెంజ్'లో పాల్గొని మొక్కలు నాటడంతో పాటు, మా కృషిని కొనసాగించమని ఆహ్వానించటం అభినందనీయం.**

హరిత విప్లవం మొదలుపెట్టినపుడు జాదవ్ పయంగ్ ఒక్కరే, కానీ ఆయన సాధించిన ఫలితాలు మాత్రం ప్రపంచ గుర్తింపును పొందాయి. అభివృద్ధి చెందిన దేశాలతో పాటు, లాటిన్ అమెరికా దేశాలు ఆయనను స్వయంగా ఆహ్వానించి అస్సామీ, హిందీలో కొనసాగే ఆయన ప్రసంగాలను, క్షేత్ర అనుభవాలను తమ భాషల్లోకి అనువాదం చేసుకొని మరీ వింటున్నాయి. అలాగే హరితహారంతో కేసీఆర్ లాంటి స్ఫూర్తి ప్రదాతలు ఎక్కడినుంచో రారు, మన మధ్యే ఉంటూ మార్గనిర్దేశం చేస్తారు. ఇలాంటివారు వేసిన హరిత బాటల్లో నడవటం, భరతమాతను హరితదేశంగా మలుచుకోవటం మన ముందున్న కర్తవ్యం. భవిష్యత్ తరాలు మనను నిందించక ముందే మేల్కొందాం. ప్రకృతి రక్షణకు, పచ్చదనం పెంపునకు పునరంకితమవుదాం.

**(వ్యాసకర్త: మాజీ రాజ్యసభ ఎంపీ, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ వ్యవస్థాపకులు)**

**తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన హరితహారం కృషి ఫలితంగా హైదరాబాద్ సిగలో మరో కలికితురాయి చేరింది. 2020 సంవత్సరానికిగాను హైదరాబాద్ మహానగరం 'ట్రీ సిటీ ఆఫ్ ది వరల్డ్'గా గుర్తింపు పొందింది. ఐక్యరాజ్యసమితికి చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్, అర్బోర్ డే ఫౌండేషన్ సంయుక్తంగా హైదరాబాద్‌కు ఈ పురస్కారాన్నిచ్చాయి.**

# సంక్షోభంలో విద్యారంగం

**ప్రజాపాలన తెస్తామని ఎన్నికలకు ముందు చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటూ విద్యారంగాన్ని సంక్షోభంలోకి నెట్టివేస్తున్నది. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న సుమారు 30 వేలకు పైగా పాఠశాలల్లో వసతులు కల్పించి, వాటిని అభివృద్ధి చేయకుండా నియోజకవర్గానికో ఇంటర్నేషనల్ స్కూల్ స్థాపిస్తామని, మండలానికో సమీకృత గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేస్తామంటూ కాలయాపన చేస్తున్నది. అంతేకాదు, రాష్ట్రంలోని 17 ప్రభుత్వ యూనివర్సిటీలను సమగ్రంగా అభివృద్ధి చేయకుండా స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ అంటూ విద్యా వ్యతిరేక ప్రచారార్భాటం చేస్తున్నది.**



**కె.వేణుగోపాల్**
98665 14577



కాంగ్రెస్ సర్కార్ చర్యల వల్ల అట్టడుగు కులాలు, వర్గాల విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం పొంచి ఉన్నది. కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలు సర్కారీ విద్యను ఎంతవరకు బలోపేతం చేయగలదో పరిశీలించే ముందు కేంద్ర ప్రభుత్వం విద్యా విధానాలు ఎలా ఉన్నాయో సంక్షిప్తంగా చూద్దాం. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజాస్వామిక సెక్యులర్ రాజ్యం స్థానంలో హిందూ మతం పేరిట మతోన్మాద రాజ్యాన్ని స్థాపించడానికి జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చింది. అందులో భాగంగా ఎన్టీయే లాంటి కేంద్రీకృత పరీక్షలకు ఆమోదముద్ర వేసి, పేపర్లు లీకు చేయడం, అమ్ముకోవడాన్ని ప్రోత్సహిస్తున్నది. తద్వారా 24 లక్షలకు పైగా విద్యార్థులకు అన్యాయం జరిగింది. 2014 బడ్జెట్‌లో విద్యారంగానికి మోదీ సర్కార్ ఆరు శాతం నిధులను కేటాయించగా.. 2024 నాటికి అవి 2.5 శాతానికి పడిపోయాయి. పాఠ్యాంశాల నుంచి డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం, పీరియాడిక్ టేబుల్, మొఘలుల చరిత్రను తొలగించడం, గాంధీజీని చంపిన గాడ్సే పాత్రను వక్రీకరించడం లాంటి చర్యలు శాస్త్రీయ దృక్పథాన్ని, హేతుబద్ధతను తుదముట్టించడమే. పాఠశాల విద్యను 5+3+3+4 పద్ధతిలో వ్యవస్థీకరించి, పాఠశాల విద్యావ్యవస్థను, పాఠ్య ప్రణాళికను బీజేపీ సర్కార్ ధ్వంసం చేస్తున్నది. ఇటువంటి దుష్పరిణామాలకు దారితీసిన జాతీయ విద్యా విధానం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఒక విధానమంటూ లేకపోవడం శోచనీయం.

**ప్రజా పాలన పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం మూస ధోరణిని అవలంబిస్తున్నది. విద్యారంగానికి బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయిస్తామని మ్యానిఫెస్టోలో ప్రకటించి, ఇప్పుడు 7.3 శాతమే కేటాయించింది. విద్యారంగానికి తమిళనాడులో 13.4 శాతం, కర్ణాటకలో 12.9 శాతం, కేరళలో 14.8 శాతం, ఏపీలో 12.6 శాతం నిధులు కేటాయించారు.**

ఒక్క పాఠశాలనూ మూసివేయమని ప్రకటించి, మూసివేతలను నిరాటంకంగా కొనసాగిస్తున్నది. సరిపడా తరగతి గదులు, సబ్జెక్టుకో ఉపాధ్యాయుడు, మరుగుదొడ్లు నీటి సౌకర్యం లేక పాఠశాలలు నిర్వీర్యమైపోతున్నాయి. 2022-23 విద్యా సంవత్సరంలో దాదాపు 8,500 పాఠశాలల్లో 20 మంది కంటే తక్కువ విద్యార్థులున్నారు. 1864 పాఠశాలల్లో విద్యార్థులే లేరు. విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గిపోతుందో అధ్యయనం చేయకుండా, సమస్యలకు పరిష్కారాలను కనుక్కోకుండా విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని సాకు చెప్తూ పాఠశాలలను మూసివేస్తుండటం దారుణం. రాష్ట్రంలో ఒకే గది ఉన్న పాఠశాలలు 3,620, ఒకే టీచర్ ఉన్న పాఠశాలలు 4,984 ఉన్నట్టు తెలుస్తున్నది. జీవో నెంబర్ 25 ప్రకారం.. 60 మంది విద్యార్థులకు ఇద్దరే ఉపాధ్యాయులను కేటాయిం చి పాఠశాలలను కాంగ్రెస్ సర్కార్ మూసివేస్తున్నది. రాష్ట్రంలో 523 మండలాల్లో మండల విద్యాశాఖాధికారులు లేరు. 64 డిప్యూటీ జిల్లా విద్యా అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 8 జిల్లా విద్యా శాఖాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉపాధ్యాయులను తయారుచేసే డైట్ కళాశాలల్లో 189 ఖాళీలున్నాయి. అకడమిక్ క్యాలెండర్, పాఠ్యాంశాలను తయారుచేసే ఎస్‌సీఈఆర్‌టీలో 94 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్న పాఠశాల ల ను పటిష్ఠపరచకుండా నియోజకవర్గానికో ఇంటర్నేషనల్ స్కూ ల్ స్థాపిస్తామని పాలకులు అంటుండటం విడ్డూరం. ఐదు రకాల గురుకులాలతో పాటు, ఆదర్శ, కేజీబీవీ పాఠశాలలకు తోడు ఇంటర్నేషనల్ స్కూల్ మరొక అంతరాల దొంతర కాబోతున్న ది. అంతేకాకుండా, సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలలను పట్టణాలకు తీసుకురావడం, ఒకే ప్రాంగణంలో కులాలవారీగా స్కూళ్లను నిర్మించడం, 1-3 తరగతులకు ప్రీ ప్రైమరీ శిక్షణ పొందిన ఉపాధ్యాయులను నియమించకుండా అంగన్వాడీలలో కలపడం, పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ)ల స్థానంలో అమ్మ ఆదర్శ పాఠశాలలను తీసుకురావడం లాంటి చర్యలు కొత్త సమస్యలను తీసుకొస్తున్నాయే తప్ప ఉన్న సమస్యలను పరిష్కరించవు. నూతన విద్యా విధానం మీద ఎటువంటి అభిప్రాయాన్ని వెల్లడించకుండానే ఇంటర్మీడియట్ తరగతులను సెకండరీ విద్యలో, ప్రాథమిక తరగతులను అంగన్వాడీలో విలీనం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది.

అలాగే ఉన్నత విద్యలో ప్రభుత్వ రంగంలో ఉన్న 7 సంప్రదాయ, 10 ప్రత్యేక విశ్వవిద్యాలయాలతో కలిపి మొత్తం 17 స్టేట్ యూనివర్సిటీలను, 4,036 కాలేజీలను సమగ్రంగా అభివృద్ధి చేయకుండా భూకబ్జాదారులకు, విద్యా వ్యాపారులకు, కంపెనీలకు ప్రైవేటు యూనివర్సిటీలు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతులు ఇచ్చారు. ప్రభుత్వ రంగంలో కాకుండా ప్రభుత్వ- ప్రైవేటు భాగస్వామ్యం పద్ధతిలో 50 ఎకరాల భూమిలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ యూనివర్సిటీల్లో రెండు వేలకు పైగా ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. యూనివర్సిటీ వసతి గృహాలు అధ్వానంగా ఉన్నాయి. బాసర ట్రిపుల్ ఐటీ సంక్షోభంలో కూరుకుపోయింది. అధ్యాపకులు లేక విద్యాబోధన కునారిల్లింది. మారుతున్న సాంకేతిక పరిశోధనలకు అనుగుణంగా సిలబస్‌ను మార్చలేదు. ప్రభుత్వ కళాశాలలు, విశ్వవిద్యాలయాలను అభివృద్ధి చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇది తార్కాణం.

ప్రస్తుతమున్న యూనివర్సిటీలు, పాలిటెక్నిక్ కళాశాలలు, ఐటీఐలను సమగ్రంగా అభివృద్ధి చేసి విద్యార్థులకు నైపుణ్యాలు నేర్పవచ్చు. అలా చేయకుండా కొత్తగా స్కిల్ యూనివర్సిటీ స్థాపించడమెందుకు? అక్కడ 30 వేల మందికి స్కిల్స్ నేర్పిస్తున్నట్టు చెప్తున్నారు. ముఖ్యమంత్రి విదేశీ పర్యటనలో భాగంగా 19 విదేశీ కంపెనీలు హైదరాబాద్‌కు రాబోతున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయా బహుళ జాతి కంపెనీలకు నైపుణ్యం కలిగిన, తక్కువ జీతానికి పనిచేసే కార్మికులను తయారు చేయడానికే ఈ స్కిల్ యూనివర్సిటీని స్థాపించారా? అనే అనుమానం కలుగుతున్నది. ఈ యూనివర్సిటీలో సిబ్బంది నియామకం, అడ్మిషన్లలో రిజర్వేషన్లు పాటిస్తారా? ఫీజులు ఎంత ఉంటాయి? తదితర వివరాలు ఇంకా అధికారికంగా తెలియవలసి ఉన్నది.

జిల్లాకో వైద్య కళాశాలలను ఏర్పాటు చేసే కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే రాష్ట్రంలో 27 ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రారంభమయ్యాయి. వాటిలో సరిపడా అధ్యాపకులు లేకపోవడంతో ఏటా ఎన్ఎంసీ అనుమతులు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. 28 ప్రైవేటు వైద్య కళాశాలల్లో బోధకులు లేకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన వైద్యవిద్య అందడం లేదు. అంతేకాదు, డీమ్డ్ యూనివర్సిటీ పేరిట మెడికల్ కాలేజీల నిర్వహణ వల్ల పేద, వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు, కన్వీనర్ కోటా సీట్లు తగ్గిపోయి, పేద విద్యార్థులకు అన్యాయం జరిగే ప్రమాదం ఉంది. యూజీసీ నిర్వాకం వల్ల బలహీనవర్గాలకు చెందిన మెరిట్ విద్యార్థులకు తీరని అన్యాయం జరగనున్నది.

వాస్తవానికి, తెలంగాణలో 30 లక్షలకు పైగా ఉన్న నిరుద్యోగులు ఏయే స్థాయి వరకు చదువుకున్నారు? వారికి ఏయే నైపుణ్యాలు నేర్పగలం? అనే సమాచారం ఎక్కడా లేదు. ప్రభుత్వానికి గాని, కంపెనీలకు గాని ఈ నిరుద్యోగులకు ఏ రకమైన నైపుణ్యాలు అందించాలనే విషయంపై స్పష్టత లేదు. ఇటువంటి పరిస్థితుల్లో హైదరాబాద్‌కు వచ్చే దేశ, విదేశీ కంపెనీలకు కావలసిన ఉద్యోగుల కోసమే రాష్ట్రంతో సంబంధం లేకుండా అందరికీ నైపుణ్యాలు నేర్పించడానికే ఈ స్కిల్ యూనివర్సిటీ వస్తున్నట్టుగా తెలుస్తున్నది. నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెగించి కొట్లాడిన తెలంగాణ నిరుద్యోగ యువతీయువకుల కోసం కాదని, దాని పేరు ద్వారా తెలుస్తున్నది. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ అన్నారే గాని, యంగ్ తెలంగాణ స్కిల్ యూనివర్సిటీ అని పేరు పెట్టలేదు.

**పాఠశాల స్థాయి నుంచి అన్ని వసతులతో కూడిన వ్యాయామ విద్య లేకుండా స్పోర్ట్స్ యూనివర్సిటీని స్థాపించడం అర్థరహితం. రాష్ట్రంలోని వేలాది ప్రభుత్వ పాఠశాలలకు ఆటస్థలాలు లేవు. క్రీడా సామాగ్రి అందుబాటులో లేదు. అన్ని పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులు మంజూరు కాలేదు. అసలు చాలా ప్రైవేట్ పాఠశాలలకు ఆటస్థలాలే లేవు. అటువంటి పరిస్థితుల్లో స్పోర్ట్స్ యూనివర్సిటీని స్థాపిస్తామనడం పునాది లేకుండా భవనం నిర్మించడమే.**

కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన నాటినుంచి గత తొమ్మిది నెలల్లో విద్యారంగంలో వచ్చిన, వస్తున్న మార్పులు ప్రభుత్వ విద్యను బలహీనపరిచేలా ఉన్నాయి. పేదలకు, మధ్యతరగతికే కాకుండా, ఎగువ మధ్య తరగతికి కూడా విద్యను దూరం చేసే విధంగా ఉన్నాయి. వీటి వల్ల అభ్యసన సంక్షోభం ఇంకా తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. విద్యారంగానికి పొంచిఉన్న ప్రమాదాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు గ్రహించాలి.

**(విద్యారంగ సమస్యలపై తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ నేడు హైదరాబాద్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్న సందర్భంగా)**

**(వ్యాసకర్త: పూర్వ అధ్యక్షులు, ఏపీటీఎఫ్)**